సాక్షి చిత్తూరు

ఆదివారం । 14 । జనవరి । 2024

I



పకడ్బందీగా ఎన్నికల కసరత్తు

సార్వత్రిక ఎన్నికల కసరత్తును జిల్లా అధికారులు పకడ్బందీగా.. పారదర్శకంగా నిర్వహిస్తున్నారు. - IIలో



వరసిద్ధునికి రూ.4లక్షల విరాళం

కాణిపాకం వినాయకస్వామి ఆలయంలో నిత్యాన్నదానానికి దాతలు వేర్వేరుగా విరాళం అందించారు. - IIలో



చెరుకుతోటల దగ్ధం

పుత్తూరు మండలం నందిమంగళంలో ఆరుగురు రైతులకు చెందిన చెరుకు తోటలు అగ్నికి ఆహుతయ్యాయి. - IIలో

న్యూస్‌రీల్

సుఖసంతోషాలతో ‘పెద్దల పండుగ’



మంత్రి పెద్దిరెడ్డి



ఎంపీ మిథున్‌రెడ్డి

పుంగనూరు : జిల్లావాసులు సుఖసంతోషాలతో భోగి, సంక్రాంతి, కనుమ పండుగలు జరుపుకోవాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఆకాంక్షించారు. శనివారం ఈ మేరకు మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామీణ కుటుంబాలు ఆర్థికాభివృద్ధి సాధించాయన్నారు. నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు పథకం కింద నూతనంగా ఊళ్లే నిర్మితమవుతున్నాయని వెల్లడించారు. పెద్దల పండుగను ప్రజలు ఆనందంగా జరుపుకోవాలని, సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించాలని కోరారు.

16న కైలాసగిరి ప్రదక్షిణ

శ్రీకాళహస్తి: సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఈనెల 16న శివపార్వతులు కై లాసగిరి ప్రదక్షిణ చేయనున్నారు. సాధారణంగా శ్రీకాళహస్తిలో ప్రతిఏటా రెండు సార్లు స్వామి, అమ్మవార్ల గిరిప్రదిక్షిణ ఉంటుంది. మొదటిది కనుమ పండుగ రోజున కైలాసగిరుల్లో ఉండే మునులు, రుషులు, దేవతలను మహాశివ రాత్రి ఉత్సవాల్లో జరిగే తమ కల్యాణానికి రావాలని ఆహ్వానిస్తారు. అనంతరం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో స్వామి, అమ్మవార్ల కల్యాణం అనంతరం తిరిగి మరోసారి గిరిప్రదక్షిణగా వెళ్లి దేవతలకు వీడ్కోలు పలుకుతారు. ప్రతి ఏటా ఈ గిరిప్రదక్షిణ ఎంతో వేడుకగా జరుగుతుంది. ఈ మేరకు మంగళవారం ఉదయం 7.30 గంటలకు స్వామి, అమ్మవార్లు ఆలయం నుంచి గిరిప్రదక్షిణకు బయలుదేరనున్నట్టు ఆలయాధికారులు తెలిపారు.

గమ్యం @ 2 గంటలు!

సౌకర్యవంతంగా.. అత్యంత వేగంగా ప్రయాణికులను గమ్యానికి చేర్చే బుల్లెట్ ట్రైన్ త్వరలోనే పట్టాలెక్కనుంచి మూడు రాష్ట్రాల ప్రజలకు సరికొత్త అనుభూతిని పంచనుంది. పది గంటల ప్రయాణాన్ని కేవలం రెండు గంటల్లోనే అధిగమించేలా పరుగులు తీయనుంది. ఈ మేరకు రైల్వేశాఖ పకడ్బందీగా కసరత్తు చేస్తోంది. రైతులను ఒప్పించి పారదర్శకంగా భూసేకరణకు సన్నాహాలు చేస్తోంది.



బుల్లెట్ ట్రైన్ (ఫైల్)

మొత్తం స్టాపింగ్స్ ఇవీ..

చెన్నై, పూనమల్లి, చిత్తూరు, కోలార్, కొడహళ్లి, వైట్‌ఫీల్డ్, బయపల్లె, కెంగేరి, మాధ్య, మైసూర్‌లో బుల్లెట్ ట్రైన్‌కు స్టాపింగ్‌లు ఇచ్చారు.

- చెన్నై టూ మైసూర్ వయా చిత్తూరు మీదుగా బుల్లెట్ ట్రైన్
- తమిళనాడు, ఆంధ్ర, కర్ణాటకను కలుపుతూ పయ్రాణం
- ముమ్మరంగా సర్వే చేస్తున్న ఎన్‌హెచ్‌ఎస్‌ఆర్‌సీఎల్ అధికారులు

గుడిపాల : తమిళనాడులోని చెన్నై నుంచి కర్ణాటకలో ఉన్న మైసూరుకు బుల్లెట్ ట్రైన్ నడపాలని రైల్వేశాఖ నిర్ణయించింది. ఈ మేరకు సుమారు 435 కిలోమీటర్ల మేర ప్రత్యేక ట్రాక్ వేయించేందుకు సన్నాహాలు చేస్తోంది. దీనిపై ఇప్పటికే ఎన్‌హెచ్‌ఎస్‌ఆర్‌సీఎల్ (నేషనల్ హైస్పీడ్ కార్పొరేషన్ లిమిటెడ్) అధికారులు ముమ్మరంగా సర్వే నిర్వహిస్తున్నారు. గంటకు 350 కిలోమీటర్ల వేగంతో నడిచే బుల్లెట్ ట్రైన్ పూర్తిగా ఫ్లైఓవర్‌పై వేసిన ట్రాక్‌లోనే వెళ్లనుంది. ఈ క్రమంలో జిల్లాలోని 41 గ్రామాల్లో భూసేకరణకు అధికారులు చర్యలు చేపట్టారు.

రైతులతో సమావేశాలు

ఎన్‌హెచ్‌ఎస్‌ఆర్‌సీఎల్ అధికారులు భూసేకరణలో భాగంగా గ్రామ సభలు నిర్వహిస్తున్నారు.. 41 గ్రామాలకు గాను 30 గ్రామాలకు చెందిన రైతులతో ఇప్పటికే సమావేశాలు పూర్తి చేశారు. వారి అభిప్రాయాలను పకడ్బందీగా సేకరిస్తున్నారు. భూములు ఇచ్చిన వారి కుటుంబంలో చదువుకున్న వారికి ఏదో ఒకవిధంగా ఉద్యోగావకాశం కల్పిస్తామని అధికారులు హామీ ఇస్తున్నారు. దీనిపై పలువురు రైతులు సుముఖత వ్యక్తం చేసినట్లు అధికారులు వెల్లడిస్తున్నారు.

మూడు రాష్ట్రాలను కలుపుతూ..

తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకను కలుపుతూ 340 గ్రామాల మీదుగా బుల్లెట్ ట్రైన్ రాకపోకలు సాగించేలా అధికారులు డీపీఆర్ రూపొందించారు. సాధారణంగా చెన్నై నుంచి మైసూర్‌కు రైలులో వెళ్లాలంటే దాదాపు 10 గంటల సమయం పడుతుంది. అదే బుల్లెట్ ట్రైన్‌లో అయితే కేవలం 2 గంటల్లోనే గమ్యం చేరుకోవచ్చు. ఈ ట్రైన్‌కు చిత్తూరులో స్టాపింగ్ ఇవ్వడంతో జిల్లావాసులకు సైతం సేవలందించనుంది.

జిల్లాలో 41 గ్రామాలు

జిల్లాలోని 41 గ్రామాల మీదుగా బుల్లెట్ ట్రైన్ ప్రయాణించనుంది. ఈ మేరకు 435 కిలోమీటర్ల వరకు 18 మీటర్ల వెడల్పుతో ఫ్లైఓవర్ నిర్మించేందుకు డిజైన్ రూపొందించారు. హైదరాబాద్‌కు చెందిన ఓ సంస్థ ఇప్పటికే శాటిలైట్, ల్యాండ్ సర్వే పూర్తి చేసింది. 750 మంది ప్రయాణికులతో గంటకు 250 నుంచి 350 కిలోమీటర్ల వేగంతో బుల్లెట్ ట్రైన్ వెళ్లేందుకు వీలుగా ఫ్లైఓవర్‌ను నిర్మించనున్నారు. గుడిపాల మండలంలోని 189 కొత్తపల్లె వద్ద చిత్తూరు స్టాపింగ్ ఏర్పాటు చేస్తున్నారు.



గ్రామ సభ నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)



సర్వేలో భాగంగా నాటిన రాయి

ఐదురెట్ల పరిహారం

“ బుల్లెట్ ట్రైన్‌లో ప్రయాణం సౌకర్యవంతంగా ఉంటుంది. కేవలం రెండు గంటల్లోనే చెన్నై నుంచి మైసూర్‌కు వెళ్లిపోవచ్చు. మొత్తం ఫ్లైఓవర్ మీద వేసిన ట్రాక్‌పైనే రైలు వెళుతుంది. ఇందుకోసం భూసేకరణ చేపట్టాం. రైతులకు మార్కెట్ ధర కంటే ఐదు రెట్లు పరిహారం ఇవ్వాలని నిర్ణయించాం.

– నరసింహ, ఏఈ, ఎన్‌హెచ్‌ఎస్‌ఆర్‌సీఎల్

పతంగులతో ఓటు హక్కుపై అవగాహన



పతంగులు ఎగురవేస్తున్న అధికారులు, యువత

చిత్తూరు రూరల్: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఓటు హక్కుపై వినూత్న రీతిలో అవగాహన కార్యక్రమం చేపట్టారు. సంక్రాంతిని పురస్కరించుకుని ఓట్ ఈజ్ రైట్.. ఓట్ ఫర్ ష్యూర్.. ఓటు వజ్రాయుధం.. అంటూ రాసిన నినాదాలతో కూడిన పతంగులను ఎగురవేశారు. ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ–2024 కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ అధికారులు శనివారం చిత్తూరు మెసానికల్ మైదానంలో యువత, విద్యార్థులతో కలిసి గాలిపటాలను ఎగరవేశారు. సహాయ కమిషనర్ గోవర్ధన్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికలకు సంబంధించి స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా ఓటు హక్కు ఆవశ్యకతపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చిన్నయ్య, లోకనాథం, నరసింహం పాల్గొన్నారు.

మభ్య పెట్టారు.. మన్నించండి


- వైఎస్సార్‌సీపీ వార్డు మెంబర్‌కు పచ్చ కండువా వేసిన మాజీ మంత్రి అమరనాథరెడ్డి
- తిరిగి మళ్లీ సొంత గూటికి చేరుకున్న నేత



రవికుమార్‌కి పార్టీ కండువా వేస్తున్న నాయకులు

గంగవరం : వైఎస్సార్‌సీపీ వార్డు మెంబర్ రవికుమార్‌ను మాజీ మంత్రి అమరనాథరెడ్డి రెండు రోజు క్రితం మభ్యపెట్టి పసుపు కండువా వేశారు. శనివారం అదే వార్డు మెంబర్ మళ్లీ సొంత గూటికే చేరుకున్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, నాయకులు చంద్రప్ప ఆధ్వర్యంలో పార్టీలో చేరిపోయారు. రవికుమార్ మాట్లాడుతూ పచ్చ కండువా వేసుకోవడం నచ్చలేదన్నారు. మనసు ఒప్పుకోలేదని, పార్టీ పెద్దలు మన్నించాలని కోరారు. రాజకీయాల్లో నిజాయితీ లేని వాళ్లని ప్రజలు ఎప్పటికీ క్షమించరని, ఒక్కసారి చెడ్డపేరు తెచ్చుకుంటే జీవితాంతం ఆ మచ్చ వెంటాడుతుందన్నారు. క్షణికావేశంలో జరిగిన తప్పుకు పశ్చాత్తాపం చెందుతున్నట్లు తెలిపారు. గత టీడీపీ హయాంలో అమరనాథరెడ్డి కంటికే కనిపించేవారు కాదని, అభివృద్ధిని పూర్తిగా గాలికి వదిలేశారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ సహకారంతో చిన్నూరును అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లినట్లు వివరించారు. టీడీపీ నేతలు ఎన్ని కుట్రలు చేసినా ముఖ్యమంత్రి జగనన్నను పజల నుంచి దూరం చేయలేరని స్పష్టం చేశారు. స్థానిక నాయకులు భాస్కర్‌రెడ్డి, రెడ్డిప్రసాద్, ఆనంద, బాలు, మంజునాథ్, బోస్‌రెడ్డి పాల్గొన్నారు.

‘సప్తగిరి’లో డిజిటల్ సేవలు



ప్రసాద్, చైర్మన్

చిత్తూరు అగ్రికల్చర్: సప్తగిరి గ్రామీణ బ్యాంకులో ఖాతాదారులకు డిజిటల్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు బ్యాంకు చైర్మన్ ఏఎస్ఎన్ ప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన చిత్తూరులోని సప్తగిరి గ్రామీణ బ్యాంకులో విలేకరులతో మాట్లాడారు. నాలుగు ప్రాంతీయ కార్యాలయాలు, 240 శాఖలతో బ్యాంకు అభివృద్ధి పథంలో పయనిస్తోందన్నారు. డిపాజిట్‌లపై ఆకర్షణీయమైన వడ్డీ ఇస్తున్నామని, తక్కువ వడ్డీకే రుణాలు మంజూరు చేస్తున్నామని వెల్లడించారు. వృద్ధుల సంక్షేమం కోసం అటల్ పెన్షన్ యోజన పథకానికి అవకాశం కల్పించినట్లు చెప్పారు. ఈ పథకం కింద 60 ఏళ్లు నిండిన తర్వాత జీవితకాలంపాటు నెలవారీగా రూ.వెయ్యి నుంచి రూ.5వేల వరకు పింఛన్ పొందవచ్చన్నారు. అలాగే పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై బీమా సౌకర్యం కూడా ఉన్నట్లు వివరించారు. ఇందుకోసం ఖాతాదారులు పీఎంఎస్‌బీవై అయితే రూ.20, పీఎంజేజేబీవై పథకానికి రూ.436 చెల్లిస్తే చాలని తెలిపారు. ఆన్‌లైన్, మొబైల్, నెట్ బ్యాంకింగ్‌తోపాటు యూపీఐ సదుపాయం కూడా ఈ నెల నుంచి అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ ఖాళీగా ఉన్నాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 56,588 మంది స్వామివారిని దర్శించుకోగా, 16,754 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.26 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

పీజీ పరీక్ష ఫలితాలు విడుదల

తిరుపతి సిటీ : ఎస్వీయూలో నిర్వహించిన ఎంఎస్సీ జాగ్రఫీ మూడో సెమిస్టర్, ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీ నాలుగో సెమిస్టర్ ఫలితాలను విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ దామ్లా నాయక్ శనివారం తెలిపారు. ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చన్నారు.

పకడ్బందీగా ఎన్నికల కసరత్తు

- నిరంతర పర్యవేక్షిస్తున్న ఉన్నతాధికారులు
- సిబ్బంది బదిలీలకు సన్నాహాలు

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కలెక్టరేట్ అధికారులు పకడ్బందీగా ముందస్తు కసరత్తు చేపట్టారు. ఈ నెల 22వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రచురణకు చర్యలు చేపడుతున్నారు. ఎన్నికల నిర్వహణలో ప్రమేయం ఉన్న అధికారుల బదిలీలకు సంబంధించిన వివరాలను ఉన్నతాధికారులకు పంపే కసరత్తును ముమ్మ రం చేశారు. మొత్తం ప్రక్రియను కలెక్టర్ షణ్మోహన్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్‌ఓ రాజశేఖర్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

ఓటింగ్ యంత్రాలపై అవగాహన

సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతోంది. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఓటింగ్ యంత్రాలను ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో కలెక్టరేట్, ఆర్డీఓ కార్యాల యాల్లో, ప్రధాన కూడళ్ల వద్ద ఓటు వేసే విధానంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇందుకోసం అనుభవజ్ఞులైన తహసీల్దార్లను నియమించారు.

రెవెన్యూ అధికారులే కీలకం

ఓటర్ల జాబితా తయారీ మొదలు.. లెక్కింపు ముగిసే వరకు రెవెన్యూ అధికారులే కీలక పాత్ర పోషించనున్నారు. జిల్లాలో ఒకేచోట మూడేళ్ల సర్వీసు పూర్తి చేసిన 22 మంది తహసీల్దార్లు, అదే కేడర్‌లో ఇతర కార్యాలయాల్లో పని చేస్తున్న అధికారుల్లో సుమారు 30 మంది బదిలీ కానున్నట్లు సమాచారం. ఈ మేరకు సిద్ధం చేసిన నివేదికను రాష్ట్ర అధికారులకు కలెక్టరేట్ నుంచి పంపారు.



ఈవీఎంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సమస్యలకు అవకాశం లేకుండా

నామినేషన్ ప్రక్రియపై ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరిస్తోంది. అక్రమాల కట్టడి, ఫిర్యా దుల స్వీకరణ, అనుమతుల జారీ, నామినేషన్ తదితర అంశాలకు సంబంధించి 15 రకాల యాప్, పోర్టల్‌లను కేంద్ర ఎన్నికల సంఘం అందుబాటులోకి తెచ్చింది. దీనిలో భాగంగా నియమ నిబంధనలపై మాస్టర్ ట్రైనీ(డీఎల్ ఎంటీ)లకు శిక్షణ ఇచ్చారు. వీరి ద్వారా అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనీ(ఏఎల్ఎంటీ)లకు శిక్షణ ఇప్పించనున్నారు.

సాంకేతికతపై ప్రత్యేక శిక్షణ

ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల సభలు, సమావేశాలు, అనుమతులను సువిధ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో జారీ చేయనున్నారు. నగదు, మద్యం పంపిణీ, ఓటర్లను భయపెట్టి పోలింగ్ కేంద్రాలకు రాకుండా చేయడం, ప్రలోభాలకు గురిచేసి లబ్ధి పొందాలని చూడటం వంటి అక్రమాలను కట్టడి చేసేందుకు సి-విజిల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు సాంకేతికతను పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా శిక్షణ ఇచ్చేందుకు జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

పక్కాగా నిబంధనలు



ఎన్నికల నిబంధనలను పక్కాగా అమలు చేస్తున్నాం. తుది ఓటర్ల జాబితా ప్రచురణకు పకడ్బందీ కసరత్తు నిర్వహిస్తున్నాం. క్షేత్రస్థాయి అధికారులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నాం. ఓటర్ల జాబితాను పారదర్శకంగా తయారు చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. 18 ఏళ్లు నిండిన వారు కచ్చితంగా ఓటరుగా నమోదు చేసుకోవాలి.

– షణ్మోహన్, కలెక్టర్

నిబద్ధతతో విధులు



ఎన్నికల కసరత్తులో పాల్గొంటున్న అధికారులు, సిబ్బంది తమ విధులను నిబద్ధతతో నిర్వహించాలి. ఎక్కడా ఎలాంటి అలసత్వం ప్రదర్శించకూడదు. ఎన్నికల సంఘం సూచనల మేరకు పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పిస్తున్నాం. ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నాం.

– శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్

క్లుప్తంగా

వరసిద్ధునికి రూ.4లక్షల విరాళం



ఆలయ అధికారులకు చెక్కు అందిస్తున్న దాత

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి దాతలు రూ.4లక్షలను విరాళంగా అందజేశారు. శనివారం ఉదయం వైఎస్సార్ జిల్లా ఎర్రగుంట్లకు చెందిన వెంకటరెడ్డి అనే దాత నిత్యాన్నదానానికి రూ.లక్ష, పీలేరుకు చెందిన గిరిబాబు రూ.3లక్షలను వేర్వేరుగా ఆలయ అధికారులకు అందించారు. దాతలకు ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్, రమేష్ పాల్గొన్నారు.

చెరుకు తోటల దగ్ధం



కాలిపోయిన చెరుకు చూపుతున్న రైతు

పుత్తూరు: నందిమంగళం గ్రామంలో ఆరుగురు రైతులకు చెందిన 9 ఎకరాల చెరుకు తోటలు శుక్రవారం రాత్రి అగ్నికి ఆహుతైంది. తోట కాలిపోతుండగా గమనించిన గ్రామస్తులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన చేరుకున్న ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే లక్ష్మీ, గోపి, చిట్టిబాబు, రవి, సుమతి, రమేష్ అనే రైతులకు చెందిన 9 ఎకరాల చెరుకు తోట పూర్తిగా దగ్ధమైంది. కోతకు సిద్ధంగా ఉన్న చెరుకు తోట కాలిపోవడంతో తీవ్రమైన నష్టం వాటిల్లినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారని ఆరోపించారు.

ట్రాన్స్‌ఫార్మర్ దొంగల అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

చిత్తూరు అర్బన్: జిల్లాలోని పలు ప్రాంతాల్లో ట్రాన్స్ ఫార్మర్లు చోరీ చేసిన కేసుల్లో నిందితులను పోలీసులు చాకచక్యంగా అరెస్ట్ చేశారు. శనివారం ఈ మేరకు సీఐ గంగిరెడ్డి వివరాలు వెల్లడించారు. మండలంలోని బీఎన్‌ఆర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైనా ట్రాన్స్ ఫార్మర్ చోరీల కేసులపై నిఘా పెట్టామన్నారు. ఎస్‌ఐలు వెంకటసుబ్బమ్మ, ఉమామహేశ్వర్‌రెడ్డి, రామాంజనేయులు తమ సిబ్బందితో కలిసి బీఎన్‌ఆర్‌పేట సమీపంలోని కుర్పివేడు క్రాస్‌లో ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి మూడు ద్విచక్రవాహనాలు, 757 కేజీల కాపర్, 250 మీటర్ల కరెంట్ కేబుల్ వైర్ స్వాధీనం చేసుకున్నామని వివరించారు. నిందితులు తమిళనాడు వాలాజకు చెందిన సూరియ ఏలుమలై (23), శివలింగం (30), పాలసముద్రం మండలం వెంగళ్రాజకుప్పం గ్రామానికి చెందిన దినేష్(22), ఆదిత్య (19), ప్రవీణ్‌కుమార్(23), అబ్బాస్ (25)గా గుర్తించినట్లు చెప్పారు. వీరిపై ఇప్పటికే పలు కేసులున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా కేసు ఛేదించిన సిబ్బందిని సీఐ అభినందించి నగదు రివార్డు అందజేశారు.

రోడ్డుప్రమాదంలో తల్లీకుమారుడి మృతి



ఘటనాస్థలంలో పోలీసులు





చంద్రమ్మ, హేమంత్‌సాయిరెడ్డి (ఫైల్)

బంగారుపాళెం: చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై కేజీ సత్రం వద్ద శనివారం జరిగిన ప్రమాదంలో తల్లీకుమారుడు మృతి చెందారు. మరో కుమారుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. మండలంలోని జిల్లేడుపల్లె పంచాయతీ కొత్తూరు గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి భార్య చంద్రమ్మ (38) సంక్రాంతి పండుగకు సరకులు కొనుగోలు చేసేందుకు ద్విచక్రవాహనంపై పెద్ద కుమారుడు భరత్‌కుమార్‌రెడ్డి(15), చిన్నకుమారుడు హేమంత్‌సాయిరెడ్డి(9)తో బంగారుపాళెం వారపు సంతకు బయలుదేరింది. మార్గం మధ్యలో రోడ్డు దాటుతుండగా చిత్తూరు నుంచి బెంగళూరు వైపు వెళుతున్న లారీ ఢీకొంది. ప్రమాదంలో చంద్రమ్మ, చిన్నకుమారుడు హేమంత్‌సాయిరెడ్డి అక్కడికక్కడే మరణించారు. తీవ్రంగా గాయపడిన భరత్‌కుమార్‌రెడ్డిని 108 వాహనంలో చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న సీఐ నాగరాజారావు ఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న కొత్తూరు వాసులు విషాదంలో మునిగిపోయారు. కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు. మృతి చెందిన హేమంత్ సాయిరెడ్డి ఐదో తరగతి, గాయపడిన భరత్‌కుమార్‌రెడ్డి పదో తరగతి చదువుతున్నారు.

చిరుత దాడిలో దూడలు మృతి



దూడ కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

ఐరాల: మండలంలోని నగరిలో శనివారం వేకువజామున రెడ్డెప్ప అనే రైతుకు చెందిన రెండు లేగ దూడలపై చిరుతపులి దాడి చేసి హతమార్చింది. అటవీశాఖాధికారి జయశేఖర్ కథనం మేరకు.. గ్రామ సమీపంలోని మామిడి తోటలో రెడ్డెప్ప తన లేగ దూడలను కట్టేశారు. శనివారం ఉదయం వెళ్లి చూసేసరికి లేగ దూడల కళేబరాలు పడి ఉన్నాయి. బాధితుడి సమాచారం మేరకు బీట్ అధికారి రెడ్డిప్రసాద్‌తో కలిసి జయశేఖర్ ఘటనాస్థలానికి వెళ్లారు. కాలిముద్రలను పరిశీలించిన తర్వాత చిరుతపులిగా గుర్తించారు. పరిసర గ్రామాల ప్రజలు, గొర్రెల కాపరులు అటవీ ప్రాంతంలోకి వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతులు రాత్రి వేళల్లో పొలాల దగ్గరికి వెళ్లవద్దని కోరారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు



శ్రీదేవి (ఫైల్)

పుత్తూరు: పట్టణ పరిధిలోని కల్యాణపురం గ్రామంలో గత ఏడాది డిసెంబర్ 22వ తేదీన జరిగిన శ్రీదేవి(49) అనే మహిళ హత్య కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం ఈ మేరకు డీఎస్పీ వై.శ్రీనివాస రావు వివరాలను వెల్లడించారు. గోపి, శ్రీదేవి దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఏడాది క్రితం శ్రీదేవి తమిళనాడులోని తిరుత్తణి తాలూకా కొండాపురం గ్రామానికి చెందిన తన మరిది బాలయ్య అల్లుడు బి.చిరంజీవి (31)కి రూ.5 లక్షలు వడ్డీకి ఇచ్చింది. కొద్ది నెలల పాటు వడ్డీ కట్టిన చిరంజీవి తర్వాత చెల్లించలేదు. వడ్డీతో పాటు అసలు చెల్లించాలని ఫోన్ ద్వారా శ్రీదేవి ఒత్తిడి చేసేది. గత ఏడాది డిసెంబర్ 14వ తేదీన బంధువుల ముందు అప్పు చెల్లించాలంటూ చిరంజీవిని శ్రీదేవి పరుష పదాలతో తిట్టింది. దీంతో మనస్తాపానికి గురైన చిరంజీవి, తన అన్న బి.లోకేష్(37)తో చెప్పి బాధపడ్డాడు. శ్రీదేవిని చంపేయాలని నిర్ణయించుకున్న అన్నదమ్ములిద్దరూ డిసెంబర్ 22వ తేదీ ఉదయం పుత్తూరులోని శ్రీదేవి ఇంటికి వచ్చారు.. అప్పు విషయం మాట్లాడాలంటూ ఇంటి లోపలికి వెళ్లి తమ వెంట తెచ్చుకున్న ఇనుప రాడ్‌తో శ్రీదేవి తలపై కొట్టి హత్య చేశారు. ఆత్మహత్యగా చిత్రీకరించడానికి ఆమె చీరతో ఉరి వేసుకున్నట్లు మృతదేహాన్ని వేలాడదీశారు. మెడలోని బంగారు నగలను తీసుకొని అక్కడి నుంచి వెళ్లిపోయారు. హతురాలి భర్త గోపి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు శుక్రవారం చిరంజీవి, లోకేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితులు నేరం అంగీకరించడంతో రిమాండ్‌కు తరలించారు. హత్య కేసును ఛేదించిన సీఐ లక్ష్మీనారాయణ, ఏఎస్‌ఐ భక్తవత్సలంరాజు, సిబ్బందిని డీఎస్పీ అభినందించి రివార్డు అందజేశారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరి మృతి

పూతలపట్టు: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన పూతలపట్టు మండలంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ రాంభూపాల్ కథనం మేరకు.. ఒంగోలు జిల్లా నందనవనం గ్రామానికి చెందిన చిన్నమార్కొండయ్య(50), నెల్లూరు జిల్లా కలవాల గ్రామానికి చెందిన రాజేష్ పూతలపట్టు మండలం పేటమిట్ట అమర్‌రాజా కంపెనీలో పనిచేస్తున్నారు. శనివారం సాయంత్రం ఇద్దరూ ద్విచక్రవాహనంపై పాటూరు సంతగేటుకు బయలుదేరారు. అదే సమయంలో పాటూరుకు చెందిన నారాయణ పాలకల నుంచి స్వగ్రామానికి వస్తున్నాడు. పాటూరు సంతగేటు వద్ద రెండు వాహనాలూ ఢీకొన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని గాయపడినవారిని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా, చిన్న మార్కొండయ్య మృతి చెందాడు. రాజేష్ పరిస్థితి విషమంగా ఉండడంతో తమిళనాడులోని రాణిపేట సీఎంసీకి తరలించారు. నారాయణకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.